సాక్షి
కుమురం భీం
సోమవారం । 18 । ఆగస్టు । 2025



రాసేవారు‘లేఖ’!

ఒకప్పుడు పల్లెల్లోకైనా, పట్టణాల్లోనైనా మంచి, చెడు సమాచారం మోసుకొచ్చేది ఉత్తరం. కానీ ప్రస్తుతం ఉత్తరాలు రాసేవారే కరువయ్యారు. 8లో▸



ఆలయంలో భక్తుల రద్దీ

శ్రావణ ఆదివారం పురస్కరించుకుని మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో భక్తులు పోటెత్తారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.4 /24.8

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వానలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిండుకుండలా పీపీరావు ప్రాజెక్టు



అలుగు దుంకుతున్న మత్తడి

దహెగాం: ఇరవై రోజుల క్రితం నీరు లేక వెలవెల బోయిన ప్రాజెక్టులు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు చేరి కళకళలాడుతున్నాయి. మండలంలోని కల్వాడ సమీపంలో ఉన్న పీపీరావు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. గత మంగళవారం, శనివారం భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులో నీరు నిండి మత్తడి పైనుంచి నీరు పారింది. దీంతో ఎర్రవాగు ఉప్పొంగి ఉధృతంగా ప్రవహించింది. ఆదివారం ప్రాజెక్టు నీటి మట్టం 147.5 మీటర్లు కాగా పూర్తి నీటి మట్టానికి చేరుకుని మత్తడిపై నుంచి నీరు పారుతోంది. ఇన్‌ఫ్లో 750 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 750 క్యూసెక్కుల వరద ఎర్రవాగులోకి చేరుతుంది. దీంతో ఆయకట్టు సాగుకు ఢోకా లేదని రైతులు పేర్కొంటున్నారు.

గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా ప్రాజెక్టుల్లో చేరడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఆదివారం వట్టివాగు ప్రాజెక్టు రెండు గేట్లు 1.5 మీటర్లు పైకి ఎత్తి 5415 క్యూసెక్కుల నీటిని, అడ ప్రాజెక్టు ఒక గేట్ 0.5 మీటర్లు పైకి ఎత్తి 1000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతీనెల ఒకటిన వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న రాజేందర్

ఆసిఫాబాద్: గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతీనెల గ్రీన్ చానల్ ద్వారా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని చట్టపరంగా రావాల్సిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఏటా రెండు జతల యూనిఫామ్స్, సబ్బులు, షూస్ అందజేయాలని తెలిపారు. సమస్యలను పలుమార్లు డీపీవో దృష్టికి తెచ్చినా స్పందన లేదని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నరేశ్, ఉపాధ్యక్షులు నాగేశ్, విలాస్, పుష్పలత, సహాయ కార్యదర్శులు సోనేరావు, శంకర్, వసంత్, అనిల్ పాల్గొన్నారు.

కైరిగూడలో తీజ్ సంబరాలు




వేడుకల్లో పాల్గొన్న అజ్మీర శ్యాంనాయక్

రెబ్బెన: మండలంలోని కై రిగూడలో బంజారా, లంబాడా ప్రజలు తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని పెళ్లి కాని యువతులు గత 9 రోజులుగా అత్యంత నియమనిష్టతలతో తీజ్ బుట్టలకు నీళ్లు పోస్తూ పూజలు చేయగా ఆదివారం తీజ్ ఉత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సేవాలాల్, జగదాంబ ఆలయంలో సాంప్రదాయ పూజలు నిర్వహించారు. తీజ్ బుట్టలను ఆలయం వద్ద నిలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీజ్‌బుట్టలను వాగుల్లో నిమజ్జనం చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్‌తో పాటు గ్రామ నాయక్ సుబ్బారావు, చౌహాన్ ఇందల్, కున్సోత్ రమేశ్, జరుపుల గణపతి, శంకర్, దారావత్ రవీందర్, గుడి పూజారి వసంత్‌రావు, వెంకట్రావ్, యువకులు వేడుకల్లో పాల్గొన్నారు.

వేతన వెతలు

- నాలుగు నెలలుగా అందని జీతాలు
- అప్పులు చేసి కుటుంబ పోషణ
- ఆందోళనలకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయులు
- జిల్లాలో 460 మంది సీఆర్టీలు



విద్యాబోధన చేస్తున్న సీఆర్టీ

తిర్యాణి: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు రిసోర్స్ టీచర్ (సీఆర్టీ)లకు వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శాశ్వత ఉపాధ్యాయులకు ఏమాత్రం తీసిపోకుండా విధులు నిర్వహిస్తున్నా నెలనెల జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ, ప్రైమరీ పాఠశాలల్లో 460 మంది సీఆర్టీలుగా విధులు నిర్వహిస్తుండగా వారికి ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలకు సంబంధించిన జీతాలు రాకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారింది. కాగా జీతాలకు సంబంధించిన బడ్జెట్ పంపినప్పటికీ ఆర్థికశాఖ నుంచి వేతనాలు విడుదల కాలేదంటూ ట్రెజరీ అధికారులు చెబుతుండటంతో ఏం చేయాలో తెలియని, దిక్కుతోచని పరిస్థితుల్లో సీఆర్టీలు ఉన్నారు.

సీఆర్టీలదే కీలకపాత్ర..

ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహించే సీఆర్టీలు విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఓ వైపు పాఠశాల సమయంలో విద్యా బోధన చేస్తూనే మరోవైపు రాత్రి పూట స్టడీఅవర్‌లను సైతం నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వారి ఉన్నతికి దోహద పడుతున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కష్టపడి విధులు నిర్వహిస్తున్నా తమకి నెల వారీగా జీతాలు పెండింగ్ ఉంచడంపై మనస్తాపానికి గురవుతున్నారు. కుటుంబ పోషణ కోసం తెలిసిన వారందరి దగ్గర అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని, అప్పులు ఇచ్చిన వారికి ఎప్పుడు తిరిగి ఇస్తామో కూడా చెప్పలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన బాట..!

నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో సీఆర్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత (ఆగస్టు) నెలలో తమ సమస్యలు పరిష్కారం కాకపోతే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు అవసరమైతే నిరవధిక సమ్మెకు దిగాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా సీఆర్టీలకు ప్రతీనెల గ్రీన్ చానెల్ పద్ధతిలో వేతనాలు అందించాలని, మహిళా సీఆర్టీలకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఎంటీఎస్ (మినిమమ్ టైం స్కేల్) ను అమలు పర్చాలని, దశల వారీగా సర్వీసును రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

బస్సు చార్జీలు లేవు



నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. పాఠశాలకు వెళ్లేందుకు బస్సు చార్జీలకు డబ్బులు లేక తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి పాఠశాలకు వెళ్తున్నాం. ప్రభుత్వం గ్రీన్ చానెల్ పద్ధతి ద్వారా ప్రతీ నెల క్రమం తప్పకుండా జీతాలు అందజేయాలి.

– వెంకటేశ్, సీఆర్టీ, శాటిలైట్ ఆశ్రమ పాఠశాల, సుంగాపూర్

సర్వీసు రెగ్యులర్ చేయాలి



పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి. మినిమం టైం స్కేల్ విధానం అమలు పర్చాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విడుతల వారీగా సీఆర్టీల సర్వీసు రెగ్యులర్ చేయాలి. ఇతర న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.

– జర్పుల విజేశ్, సీఆర్టీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆయిల్‌పామ్‌కు పందుల బెడద

- జిల్లాలో 1,570 ఎకరాల్లో సాగు
- కాత దశలో గెలలకు నష్టం
- పరిహారం అందించాలని డిమాండ్



ఈ చిత్రంలో కనిపిస్తున్న పెంచికల్‌పేట్ గ్రామానికి చెందిన రైతు పేరు శ్రీనివాస్‌రెడ్డి. గన్నారం శివారులో సుమారు 13 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశాడు. ప్రస్తుతం పంట కాత దశలో ఉంది. నెల రోజుల క్రితం పెద్ద ఎత్తున అడవి పందుల గుంపు తోటలో ప్రవేశించి ఆయిల్‌పామ్ గెలలను నాశనం చేశాయి. పంట రక్షణ కోసం సుమారు రూ.3లక్షలతో తోట చుట్టూ మెష్ ఫెన్సింగ్ వేశాడు. అయినా అడవి పందులు తోటలోకి చొరబడుతున్నాయని వాపోతున్నాడు.



పెంచికలపేట్‌లో ఆయిల్‌పామ్ తోట

పెంచికల్‌పేట్: ప్రభుత్వం సబ్సిడీ, ప్రోత్సాహకాలు అందించడంతో జిల్లాలో అన్నదాతలు అధికారుల సూచనలతో పెద్దఎత్తున ఆయిల్‌పామ్ పంట సాగుచేశారు. నాలుగేళ్ల క్రితం నాటిన మొక్కలు ప్రస్తుతం కాపుకు వచ్చాయి. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న ఆయిల్‌పామ్ గెలలను అడవి పందులు ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పందులతో పరేషాన్..

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేయాలని ఉద్యాన వన శాఖ అధికారులు పెద్దఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రభుత్వం ఎకరానికి 90శాతం సబ్సిడీ, ఉచితంగా డ్రిప్, అంతర పంటల సాగుకు సైతం ప్రోత్సాహకం అందజేసింది. దీంతో పెంచికల్‌పేట్, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల్లోని రైతులు పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు చేశారు. కాగా ప్రస్తుతం మొక్కలు తక్కువ ఎత్తులో ఉండటంతో అడవి పందుల గుంపులు తోటలను ధ్వంసం చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా తోటల్లో సంచరిస్తున్నాయి. ఆయిల్‌పామ్ గెలలను నాశనం చేస్తున్నాయి. పంటల రక్షణకు తోటల చుట్టూ కంచె వేసినా అడవి పందుల బెడద తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. గెలలను రక్షించుకోవడానికి పగలు, రాత్రి తేడా లేకుండా తోటల్లో కాపలా కాస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల దాడులతో నష్టపోయిన పంటలకు సంబంధిత శాఖ అధికారులు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

పంటల రక్షణకు సూచనలు

ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతుల తోటలను సందర్శించి పంటల రక్షణకు సూచనలు చేస్తున్నాం. ప్రస్తుతం తక్కువ ఎత్తులో ఉన్న చెట్లకు కాత రావడంతో అడవి పందులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పంటల రక్షణకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు సలహాలు అందజేస్తున్నాం. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తా.

– సుప్రజ, హార్టికల్చర్ అధికారి, కాగజ్‌నగర్ డివిజన్

‘టీఎల్‌ఎం’ మేళాకు వేళాయె



తయారు చేసిన టీఎల్‌ఎంలు

- నేడు అన్ని మండలాల్లో కొనసాగింపు
- ఉపాధ్యాయుల ఉపకరణాల ప్రదర్శన
- 20న జిల్లాస్థాయి మేళా

కెరమెరి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చి ఆశించిన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా విద్యార్థులు కనీస అభ్యసనస్థాయి సాధించేలా కృత్యాధార బోధనకు బోధనాభ్యాసన సామగ్రి (టీఎల్‌ఎం – టీచర్ లెర్నింగ్ మెటీరియల్) దోహద పడుతోంది. ఈ సామగ్రిని సృజనాత్మకంగా రూపొందించి పాఠశాలల్లో అమలు పర్చేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. దీనికోసం మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు టీఎల్‌ఎం మేళాల నిర్వహణకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. సోమవారం మండల స్థాయిలో, ఈనెల 20న జిల్లాస్థాయిలో మేళాలు నిర్వహించనున్నారు.

జిల్లాకు ఎంపిక..

ప్రతీ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు రూపొందించిన టీఎల్‌ఎంలను మండలస్థాయిలో నేడు ప్రదర్శించనున్నారు. ఎస్‌సీఈఆర్టీ సూచించిన మార్గదర్శకాల ఆధారంగా మండలస్థాయిలోని పది ఉత్తమ టీఎల్‌ఎంలను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. వీటిలో తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం అంశాలలో రెండేసి, అన్నింటిలో కలిపి ఉత్తమంగా ఉన్న మరో రెండేసి చొప్పున ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు మండల స్థాయిలో ముగ్గురు స్థానిక విద్యా నిపుణులతో కూడిన జ్యూరీని నియమిస్తారు. జిల్లా స్థాయిలో ఆరుగురు నిపుణుల జ్యూరీ ఎనిమిది ఉత్తమ టీఎల్‌ఎంలను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తుంది.

సులువుగా అర్థమయ్యేలా..

విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా టీఎల్‌ఎం ద్వారా విద్యా బోధన చేస్తున్నారు. తమ మేథస్సుతో ఎన్నో ఉపకరణాలు తయారుచేసి, పాఠ్య పుస్తకంలో ఉన్న పాఠ్యాంశం ఆధారంగా టీఎల్‌ఎం తయారు చేసి బోధన చేస్తున్నారు. దీంతో విద్యార్థి సులువుగా పాఠాలను అర్థం చేసుకునే వీలు ఉంటుంది. గడిచిన కొన్ని సంవత్సరాలుగా పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా టీఎల్‌ఎం వినియోగించేలా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన టీఎల్‌ఎం గోడలకు అతి కించి కనిపిస్తున్నాయి. ఇందుకోసం గతంలో ఏటా ప్రభుత్వం ప్రతీ పాఠశాలకు రూ.500 విడుదల చేసేది. కానీ ప్రస్తుతం పాఠశాల నిధుల నుంచి టీఎల్‌ఎంకు వెచ్చించాలని అధికారులు పేర్కొంటున్నారు.



లేండిగూడ పాఠశాలలో టీఎల్‌ఎం తయారు చేస్తున్న ఉపాధ్యాయుడు

జిల్లాలోని పాఠశాలల వివరాలు..	
మండలాలు	15
ప్రాథమిక పాఠశాలలు	561
ప్రాథమికోన్నత పాఠశాలలు	100
విద్యార్థులు	32121

అభ్యసన సామర్థ్యాలు పెంపు



టీఎల్‌ఎం ఉపకరణాల ద్వారా విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించే అవకాశం ఉంటుంది. వినూత్న బోధనలతో విద్యార్థులను ఆకట్టుకోవచ్చు. నేడు మండల కేంద్రాల్లో నిర్వహించే టీఎల్‌ఎం మేళాకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తప్పక హాజరు కావాలి. టీఎల్‌ఎంలను ప్రదర్శించాలి.

– ఉప్పులేటి శ్రీనివాస్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్

ఆయకట్టు అగమ్యగోచరం!

- వట్టివాగు ప్రాజెక్టు ప్రధాన కుడికాల్వకు గండి
- 200 ఎకరాల్లో నీటమునిగిన పంటలు
- మరమ్మతులు ఆలస్యమయ్యే అవకాశం..
- ఆందోళనలో రైతులు



భారీ వర్షంతో వట్టివాగు ప్రాజెక్టు కాల్వకు పడిన గండి

ఆసిఫాబాద్: భారీ వర్షానికి ఆసిఫాబాద్ మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు ప్రధాన కుడి కాల్వకు గండి పడటంతో ఆయకట్టు సాగు అగమ్యగోచరంగా మారింది. ఓ వైపు సాగు పనులు ముమ్మరంగా సాగుతుండగా, అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. మరమ్మతులకు కనీసం రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద రావడంతో వట్టివాగు కాల్వల్లోకి భారీగా వరద చేరింది. దీంతో కొమ్ముగూడ సమీపంలోని వట్టివాగు ప్రాజెక్టు ప్రధాన కాల్వ 8 కిలోమీటర్ల వద్ద గండి పడింది. బూర్గుడ సమీపంలోని ఎల్– 2 వద్ద సుమారు 200 ఎకరాల్లో పంట పొలాలు వరదనీటిలో మునిగాయి. పంట పొలాలు నీటితో చెరువులను తలపించాయి. సాగునీరంతా వృథాగా పోయింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రాజెక్టు అధికారులు కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం వరినాట్లు వేస్తున్న తరుణంలో కాల్వకు గండి పడడంతో సాగు పనులకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది.

లక్ష్యం చేరని ప్రాజెక్టు

ఆసిఫాబాద్ మండలం పహాడిబండ వద్ద రూ.120 కోట్లతో వట్టివాగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 1998లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాజెక్టును ప్రారంభించారు. ఆయకట్టుకు సాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో నిర్మించిన వట్టివాగు ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదు. ప్రాజెక్టు కింద 24,500 ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. కుడికాలువ ద్వారా 21,800 ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 2,700 ఎకరాలకు సాగు నీరు అందాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం 16 వేల ఎకరాలకు సాగు నీరందిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొంటున్నా వాస్తవంగా మూడు వేల ఎకరాలకు కూడా మించడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రాజెక్టు కాల్వలు మొత్తం దెబ్బతిన్నాయి. ఆది నుంచి ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో లైనింగ్ కోల్పోయి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. చాలాచోట్ల నామరూపాలు లేకుండా పోయాయి. ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల పరిధిలోని పూర్తిస్థాయి ఆయకట్టు రైతులకు సాగునీరందించే పరిస్థితి లేదు. రెండు, మూడేళ్ల నిరీక్షించిన చాలామంది రైతులు పంట పొలాలకు సాగునీరందక.. కట్టలు తెంచేసి ఆరుతడి పంటలే సాగు చేసుకుంటున్నారు.

నీరున్నా నిష్ఫలం

వట్టివాగు ప్రాజెక్టులో సమృద్ధిగా నీరున్నప్పటికీ ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టులో వరద నీరు పెరగడంతో ప్రాజెక్టు అధికా రులు రెండు గేట్లు ఎత్తివేశారు. గరిష్ట నీటిమట్టం 239.5 మీటర్లు కాగా, ప్రస్తుతం 238.30 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో 2700 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 1000 క్యూసెక్కులు ఉంది. భారీ వర్షాలకు ప్రాజెక్టు కాల్వ కు గండి పడటంతో రూ.14 లక్షలతో మరమ్మతుల కు ప్రతిపాదనలు పంపించారు. అధికారులు చొరవ తీసుకుని మరమ్మతులు వేగంగా పూర్తిచేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



భారీ వర్షంతో గండి పడిన వట్టివాగు కాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. ప్రాజెక్టు అధికారులకు సరైన అవగాహన లేకపోవడంతో అవసరమైన ఆయకట్టుకు నీరివ్వడం లేదు. సాగు లేని ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నారు.

– మెకర్తి గోపాల్, బూర్గుడ, మం.ఆసిఫాబాద్

ప్రతిపాదనలు పంపించాం

భారీ వర్షంతో ప్రాజెక్టు కుడి కాల్వకు గండి పడింది. రూ.14 లక్షలతో మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదలైతే రెండు నెలల్లో పనులు పూర్తిచేస్తాం.

– అన్నాజీరావు, డీఈఈ

సమస్య పరిష్కారంలో అధికారులు విఫలం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు
- నేడు అటవీశాఖ కార్యాలయం ముట్టడికి పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: పోడు భూముల సమస్యను సామరస్యంగా పరిష్కరించడంలో అటవీ అధికారులు విఫలమవుతున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ అటవీ అధికారులు అత్యుత్సాహంతో పోడు రగడ జఠిలమైందన్నారు. పోడు రైతులను అడ్డుగా పెట్టుకొని ఫారెస్ట్ అధికారులు ఈ ప్రాంత ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చింతలమానెపల్లి మండలం దిందా రైతులు 400 కిలోమీటర్ల పాదయాత్ర చేసి శామీర్‌పేట్‌కు చేరుకోగానే పోలీసులు అడ్డుకొని దొంగలుగా చిత్రీకరించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. దిందా, ఇటుకపహాడ్, డబ్బా, కొండపల్లి గ్రామాల్లో అధికారుల దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు అధికారులకు వత్తాసు పలుకుతూ బీసీలకు పోడు భూములపై హక్కు లేదనడం అన్యాయమని పేర్కొన్నారు. బాధిత రైతుల పక్షాన సోమవారం అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. ఈకార్యక్రమానికి పోడు రైతులు, వివిధ సంఘాల నాయకులు తరలిరావాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షు డు దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయ, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొలెం వెంకటేశ్, జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు విజయ్, మాజీ కౌన్సిలర్ ఈర్ల విశ్వేశ్వర్‌రావు, రాపర్తి ధనుంజయ్, సుధాకర్, వెంకన్న, భుజంగరావు, తిరుపతి, సదానందం, సత్యనారాయణ, సంతోష్, బావూజీ పాల్గొన్నారు.

గణేశ్ మండపాల వివరాలు నమోదు చేసుకోవాలి

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో వినాయక విగ్రహాల ప్రతిష్టాపన చేసే నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేశ్ మండపాల నిర్వాహకులు, సభ్యులు పోలీసు శాఖ రూపొందించిన వెబ్‌సైట్ http@//policeportal.tspolice.gov.in/index.htmlZలో వివరాలు నమోదు చేయాలన్నారు. వినాయక మండపం వివరాలు, మండపం ప్రదేశం, ప్రదేశం ఓనర్ వివరాలు, గణపతి విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, సంబంధిత పోలీసుస్టేషన్, నిమజ్జనం చేసే ప్రదేశం, గణపతి విగ్రహాన్ని తీసుకెళ్లే వాహన వివరాలు, వాహనం డ్రైవర్, యజమాని వివరాలను పొందుపర్చాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాలకు డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

పోడు సమస్య పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ దండె విఠల్

కాగజ్‌నగర్‌టౌన్: పోడు సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందని ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ నేతలు చెప్పే మాటలు నమ్మి ప్రజలు ఇబ్బందులు పడొద్దని సూచించారు. గిరిజనేతర పోడు రైతులను అడ్డుపెట్టుకొని వారి సమస్యను మరింత జఠిలం చేసేలా సిర్పూర్ నియోజకవర్గంలో కొందరు బీజేపీ నాయకులు అల్లుతున్న ఉచ్చులో పడొద్దని ఆయన పోడు రైతులను కోరారు. దిందాతో పాటు అనేక గ్రామాల్లో నెలకొన్న పోడు భూముల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి చర్చించనున్నట్లు తెలిపారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు ప్రభుత్వ పరంగా అండగా ఉండి, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టానికి లోబడి మేలు చేస్తామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు


యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

తాండూర్: గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి యువకుడు గాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రం కొత్తపల్లి వారసంత సమీపంలోని రైల్వేట్రాక్‌పై రైలులో హైదరాబాద్‌కు చెందిన మహేశ్ జారిపడటంతో గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్లే క్రమంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని యువకుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం తాండూర్ పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. 108 ఈఎంటీ ప్రశాంత్, పైలెట్ అన్నం తిరుపతి ఉన్నారు.

బంగారు దుకాణంలో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేటలో గల ఓ బంగారు దుకాణంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణం వెనుక భాగం గోడకు రంధ్రం చేసి షాపులోకి గుర్తుతెలియని దుండగులు చొరబడి సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. 5 కిలోల వెండి, రూ.30 వేల నగదు దోచుకెళ్లారు. బాధితుడు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్ బృందాలు, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ఘటన స్థలానికి పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి


భీము మృతదేహం

జన్నారం:చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై గొల్లపెల్లి అనూష కథనం ప్రకారం.. జన్నారం మండలం కొత్తపేట గ్రామం కొలాంగూడకు చెందిన ఆత్రం భీము (30) ఆదివారం ఉదయం కొత్తపేట చెరువు అలుగు రావడంతో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో కాలుజారి నీటిలో మునిగాడు. ఈత రాకపోవడంతో మృతిచెందాడు. అటుగా వెళ్తున్నవారు గమనించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. ఎస్సై ఘ టనస్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు. తండ్రి అర్జున్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కరెంట్ షాక్‌తో మహిళ..


దుర్గం తార మృతదేహం

నెన్నెల: మండలంలోని కోణంపేట గ్రామానికి చెందిన దుర్గం తార (59) ఆదివారం సాయంత్రం కరెంట్ షాక్‌తో మృతి చెందింది. ఇంట్లో కూలర్ ఆఫ్ చేసే క్రమంలో విద్యుదాఘాతంతో కిందపడింది. పొరుగు వారు గమనించి కర్రతో కొట్టి పక్కకు తొలగించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వర్షానికి ఇల్లు ఉరిసి నేల తడిగా ఉండటం, కూలర్ బాడీ ఇనుపది కావడంతో కరెంట్ షాక్ వచ్చిందని భావిస్తున్నారు. భర్త బాపు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

లారీ ఢీకొని 6 గొర్రెలు మృతి

నిర్మల్: నర్సాపూర్ (జి) మండల కేంద్రం శివారులోని 61వ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం లారీ ఢీకొని 6 గొర్రెలు మృతి చెందాయి. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జెడ్ల రవికి గొర్రెల మంద ఉంది. నర్సాపూర్ (జి) శివారులో గొర్రెలు మేపుకొని తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో పోలీస్‌స్టేషన్ వద్ద జాతీయ రహదారి దాటిస్తున్నాడు. భైంసా నుంచి నిర్మల్ వెళ్తున్న లారీ డ్రైవర్ సరూప్ పూరి (రాజస్థాన్ వాసి) అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ గొర్రెల మందను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో 6 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మరికొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. జెడ్ల రవి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం


కార్మికవాడల్లో పర్యటిస్తున్న రాజారెడ్డి

నస్పూర్: సింగరేణి కార్మికవాడల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం విఫలమైందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 కాలనీ, నస్పూర్ డిస్పెన్సరీ ఏరియాలోని కాలనీల్లో ఆదివారం ఆయన బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. కాలనీల్లో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మిక కుటుంబాలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు పలు క్వార్టర్లలో ఊరుస్తోందన్నారు. వర్షపు, డ్రెయినేజీ నీరు ఇళ్లలోకి చేరడంతో సామగ్రి తడిసిపోవడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. శ్రీరాంపూర్ బ్రాంచి అధ్యక్షుడు గుల్ల బాలాజి, బ్రాంచ్ నాయకులు పాల్గొన్నారు.

రాసేవారు 'లేఖ'!

- కనుమరుగవుతున్న ఉత్తరం
- పెరిగిన సాంకేతికతే కారణం
- సెప్టెంబర్ 1 నుంచి రిజిస్టర్డ్ పోస్టుసేవలు బంద్


నిర్మల్ ప్రధాన పోస్టాఫీసు

నిర్మల్‌ఖిల్లా: సర్ పోస్టు..మేడమ్ పోస్టు..పల్లెల్లోనైన, పట్టణాల్లో ఉత్తరాలు మోసుకొచ్చే వారధి పోస్టు మాన్. సైకిల్‌పై వచ్చి బెల్ మోగిస్తూ చేతిలో ఉత్తరాన్ని పెడితే చదవాలనే ఆతృత ఉండేది. సైన్యంలో పహారా కాస్తున్న జవాను.. తల్లిదండ్రులు, భార్యకు లేఖ ద్వారా ఇచ్చిన సందేశం. నిరుద్యోగికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందన్న కబురందించే ఉత్తరం. మనసులో మాటను చెప్పలేక కవితలు రాసిన ప్రేమ భావం. సెలవులకు పిల్లలతో కలిసి ఇంటికి రమ్మని పిలుస్తూ కూతురు, అల్లుడికి అందించే ఆహ్వానం. క్యాంటీన్ ఖర్చులు, పుస్తకాలకు డబ్బులు పంపమని నాన్నగారికి విన్నపం. ఇలా సందర్భమేదైనా అన్ని రకాల భావాలను అందించే లేఖ ప్రస్తుతం రాసేవారు కరువయ్యారు. మారుతున్న కాలంతోపాటు ఉత్తరం కనుమరుగైంది.

90వ దశకం వరకు..

జిల్లాలో 90వ దశకం వరకు ఉత్తరాల బట్వాడా జోరుగా కొనసాగింది. 'తోక లేని పిట్ట తొంభై ఆమడలు పోయే', 'రెక్కలు లేని పిట్ట గూటికి సరిగ్గా చేరింది'అంటూ చిన్నారులకు ఇంట్లో పెద్దలు, నానమ్మ, తాతయ్యలు 'ఉత్తరం'పై పొడుపు కథలు అల్లేవారు. నాడు ఆత్మీయుల ప్రేమ, ఆశీర్వాదాలను, మోసుకొచ్చే ఉత్తరం కాలక్రమంలో కానరాకుండా పోయింది. పెరిగిన సాంకేతికత కారణంగా ఇది కాలగర్భంలో కలిసిపోయింది. వాటి స్థానాన్ని స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్, కొరియర్లు ఆక్రమించాయి.

కనుమరుగవనున్న 'రిజిస్టర్డ్ పోస్టు సేవలు'!

1854 సంవత్సరం బ్రిటిష్ కాలంలో మన దేశంలోకి ప్రవేశపెట్టబడిన పోస్టుబాక్సులు ఇకపై కనుమరుగు కానున్నాయి. 180 ఏళ్ల నుంచి పెనవేసుకున్న ఈ బంధం ఇక తెగిపోనుంది. రెండు దశాబ్దాల క్రితం వరకు ప్రజలు పోస్టుబాక్సులు, ఉత్తరాలతో విడదీయరాని బంధాన్ని పెనవేసుకున్నారు. బంధువులు, స్నేహితులకు రాసిన ఉత్తరాలు, గ్రీటింగ్ కార్డ్స్, అభిమాన రచయితలు, సినీతారలకు రాసిన లెటర్స్‌తోపాటు ఊరుపేరు లేకుండా రాసే ఆకాశరామన్న ఉత్తరాలు ముందు ఈ పోస్టుబాక్సుల్లో పడేస్తే..అక్కడి నుంచి చేరాల్సిన చోటుకు చేరేవి. పెరుగుతున్న టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని ఖర్చులు తగ్గించుకునే చర్యల్లో భాగంగా పోస్టుబాక్సులు తొలగించనున్నారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 1 నుంచి రిజిస్టర్డ్ పోస్ట్ సేవలు నిలిపివేయనున్నట్టు శాఖాధికారులు వెల్లడిస్తున్నారు. రెండు దశాబ్దాల నుంచి ఇంటర్నెట్, డిజిటల్ కమ్యూనికేషన్ల వల్ల సాధారణ రిజిస్టర్ పోస్టులు, పోస్టు బాక్సుల ఉపయోగం గణనీయంగా తగ్గిపోయింది. ఇకపై ఈ సేవను స్పీడ్‌పోస్ట్‌లో విలీనం చేయడం ద్వారా, పోస్టల్ డిపార్ట్‌మెంట్ ట్రాకింగ్‌లో మరింత ఖచ్చితత్వాన్ని, డెలివరీ వేగాన్ని, ఆపరేషనల్ ఎఫిషియన్సీని మెరుగుపర్చాలని ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

తపాలా సేవల్లో మార్పులు

తపాలా సేవలో మార్పులు వచ్చాయి. ఒకనాడు ఉత్తరాల బట్వాడాకు, మనీ ఆర్డర్లు పంపేందుకు, పొదుపు పథకాలు అందించేందుకు ప్రధాన కేంద్రాలుగా పోస్టాఫీసులు ఉన్నాయి. నేడు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు సేకరిస్తూ, బీమా పాలసీలు అందిస్తూ బ్యాంకులుగా రూపాంతరం చెందాయి. ప్రజలు కూడా అందివచ్చిన టెక్నాలజీ, స్మార్ట్‌ఫోన్లకు అలవాటుపడ్డారు. సెల్‌ఫోన్లు విరివిగా వినియోగించడం వంటి కారణాలతో ఉత్తరాలు కనుమరుగయ్యాయి. పార్శిళ్ల వంటివి పంపాలంటే ప్రైవేటు సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం పోస్టాఫీసుల్లో పోస్టు కార్డులు, ఇన్‌లాండ్, బుక్‌పోస్టు లెటర్లు కనిపించడం లేదు.

మానసికంగా తీరనిలోటు



జీవితానికి ఆత్మీయత అనుబంధాలకు ఉత్తరం లేఖ అనేది ఒక గవాక్షం లాంటిది. సాహిత్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత ఉత్తరానిదే. ఉత్తరం అంటే నాలుగు వాక్యాలు రెండు మడతలు కానే కాదు..ఆ ఉత్తరం కనుమరుగవ్వడం మానసికంగా తీరని లోటు.. లేఖ సాహిత్యం అనేది ఒక ఆత్మీయ ప్రపంచం అది అంతర్ధానమవడం బాధాకరం.

– టి.సంపత్ కుమార్, నవలా రచయిత, నిర్మల్

గుర్తించలేకపోతున్నారు



ఉపాధ్యాయుడిగా ఉద్యోగావకాశం వచ్చిందని నాలుగుదశాబ్దాల క్రితం ఉత్తరం ద్వారా తెలిసింది. ఆ ఆనందం మాటల్లో వర్ణించలేనిది. పెరిగిన టెక్నాలజీ అనుగుణంగా ప్రస్తుతం కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ల వినియోగం ఎక్కువైంది. లేఖ ప్రత్యేకతను ప్రజానీకం గుర్తించలేకపోతున్నారు.

– గాంధారి మురళీధర్, రిటైర్డ్ టీచర్, వద్యాల్

సేవల్లో మార్పులు



వ్యక్తిగత కుటుంబ పరమైన ఉత్తరాల ప్రాధాన్యత తగ్గుతోంది. రాఖీ పర్వదినం వంటి సందర్భాల్లో మాత్రం తోడబుట్టిన వారికి రాఖీ పంపిణీ ఇప్పటికీ పోస్ట్ ద్వారానే కొనసాగుతోంది. పోస్టాఫీస్ ఆధునాతన సేవలతో మార్పులు జరుగుతున్నాయి.

– కె.వెంకట్‌రావు, సబ్ పోస్ట్‌మాస్టర్ గ్రేడ్–2, నిర్మల్

వర్షానికి కూలిన ఇల్లు


పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. లింబా(బి) గ్రామంలోని దృపతి బాయి నివసిస్తున్న ఇల్లు కూలింది. ఆ ఇంటిని అధికారులు ఆదివారం పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండవద్దని తహసీల్దార్ కమల్‌సింగ్ సూచించారు. ఆయన వెంట ఆర్ఐ అడెల్లు, పంచాయతీ కార్యదర్శి గంగాప్రసాద్ తదితరులు ఉన్నారు.

రెబ్బెనలో..


రెబ్బెనలో కూలిన ఇంటి ముందు రాజేందర్

భీమిని: కన్నెపల్లి మండలంలోని రెబ్బెనలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గోమాస రాజేందర్ చెందిన ఇల్లు కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు ఆదివారం ఆ ఇంటిని పరిశీలించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరపున న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన ముగ్గురు అరెస్ట్


వెల్లడిస్తున్న పట్టణ ఎస్సై రాజశేఖర్, సిబ్బంది

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ ఆలయంలో శనివారం చోరీ జరుగగా నిందితులను 24 గంటల్లోనే పట్టుకున్నట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. అర్చకుడు ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపల హుండీ పగులగొట్టి కానుకలను చోరీ చేశారు. కాగా, ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు వెంటనే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. క్యాతనపల్లిలో అనుమానాస్పదంగా నలుగురు కనిపించారని, వారు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అందులో ముగ్గురిని పట్టుకున్నామని తెలిపారు. వారిని విచారించగా చోరీ చేసింది తామేనని ఒప్పుకున్నారని, వారి వద్ద నుంచి రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. ఈ మేరకు ముగ్గురు నిందితులు కుంటాల భీమయ్య, మడక చిరంజీవి, కడమంచి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పర్వతారోహణకు మంచు అడ్డు

- మౌంట్ యూనామ్ సమీపానికి గిత్తే కార్తీక్
- వారంలో 5,900 మీటర్ల ఎత్తు ప్రయాణం


కార్తీక్

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని కెలికే గ్రామానికి చెందిన గిత్తె కార్తీక్ హిమాచల్‌ప్రదేశ్‌లోని మౌంట్ యూనామ్ పర్వతారోహణకు మంచు అడ్డు తగిలింది. ఫలితంగా ఆయన ఆశయం నీరు గారింది. కార్తీక్ ఈనెల 9న మనాలి నుంచి మౌంట యూనామ్ పర్వతారోహణకు తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. 10వ తేదీ నుంచి 12 వరకు 3,650 మీటర్ల ఎత్తులో ఉన్న స్పిటిక్వాలిలోని కాజాకు చేరుకున్నారు. దీన్ని కానామో పర్వతమని పిలుస్తారు. 13న కాజా నుంచి కిబ్బర్ గ్రామానికి చేరుకున్నారు. అక్కడే ఫైనల్ ట్రెక్ చేశారు. 14న కానామో బేస్ క్యాంప్ నుంచి వారి ప్రయాణం ప్రారంభమైంది. కొంతదూరం వెళ్లాక సేద తీరారు. 15న శిఖరానికి చేరుకుని త్రివర్ణ పతాకం అధిరోహించాలని 14న అర్ధ రాత్రి ఆయన ప్రయాణం ప్రారంభించాలని అనుకున్నాడు. 15 ఉదయం వరకు 7 గంటల వరకు మంచుపాతం మొదలైంది. వాతావరణం అనుకూలించక యూనామ్ పర్వతాన్ని అధిరోహించలేక నిరాశతో వెనుతిరిగాడు. మరో వంద కి.మీ ఎత్తుకు వెళ్లగలిగితే అధిరోహించేవాడు. మొత్తం 5,900 మీటర్ల ఎత్తు వరకు వెళ్లి నిరాశతో వెనుదిరిగి వచ్చాడు. కార్తీక్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆనంద్‌బాబు, నక్ష్ ఉన్నారు.

గల్లంతైన వ్యక్తి కోసం సెర్చ్ ఆపరేషన్


డ్రోన్ కెమెరాతో పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల


ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

కడెం: కడెం వరదలో గల్లంతైన కన్నాపూర్‌కు చెందిన తిప్పిరెడ్డి గంగాధర్ జాడ కోసం పాండ్వపూర్ వంతెన వద్ద ఎస్పీ జానకీ షర్మిల ఆదివారం సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించింది. ఎన్‌డీఆర్‌ఎఫ్, మత్స్యకారులు, డ్రోన్ కెమెరాతో గాలింపు చర్యలు చేపట్టారు. కడెం, దస్తురాబాద్ మండలాల్లోని కడెం నది వెంట గాలించారు. రాత్రి వరకు జన్నారం మండలం కలమడుగు వరకు చేరారు. కడెం, గోదావరి వెంట జల్లెడ పట్టిన ఆచూకీ లభించలేదు. ఒక వైపు కడెం ప్రాజెక్టుపై నుంచి దిగువ, కన్నాపూర్ చెరువు మార్గం, గ్రామ శివారు గల చేన్ల నుంచి వెళ్లేమార్గాల్లో బారికేడ్లు పెట్టి మూసివేశారు. సీఐ అజయ్, ఎస్సై సాయికిరణ్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు గంగాధర్ తిరిగిరావాలని కుటుంబ సభ్యులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

కడెం ప్రాజెక్ట్ సందర్శన..

కడెం ప్రాజెక్టును ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ సందర్శించారు.భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్ట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో, 18 వరద గేట్ల పనితీరును తెలుసుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేశ్‌యాదవ్, నాయకులు భూమేశ్, తదితరులు ఉన్నారు. కాగా, వరదల కారణంగా మూడు రోజులుగా బోటింగ్ నిలిచిపోయింది. ప్రాజెక్ట్ వద్ద పర్యాటకుల భద్రత దృష్ట్యా పర్యాటకులకు అనుమతి ఇవ్వడం లేదు.

భారీ వృక్షాలు నరికివేత


నరికివేసిన వృక్షాలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం


చెట్లను కట్ చేస్తున్న కూలీలు

కైలాస్‌నగర్: పచ్చదనం పెంపొందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఓ వైపు అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు ప్రచారం చేస్తుంటారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉండటం అధికారుల నిర్వాకానికి నిదర్శనంగా నిలుస్తోంది. జిల్లాకేంద్రంలోని జగ్జీవన్ రాంచౌక్‌లో గల జెడ్పీ క్వార్టర్స్ వద్ద భారీగా పెరిగిన నీలగిరి, వేప వృక్షాలను నరికివేసి ట్రాక్టర్‌లో విక్రయానికి తరలించడం విస్మయానికి గురిచేసింది. ఏళ్లనాటి పెద్దపెద్ద చెట్లను నరికివేయడమేంటనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాల్టా చట్టాలు అమలు చేయాల్సిన అధికారులే ఉల్లంఘించడమేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై జెడ్పీ సిబ్బందిని సంప్రదించగా భారీగా పెరిగిన వృక్షాలు క్వార్టర్స్‌పై పడే ప్రమాదమున్నందున అధికారుల అనుమతితోనే నరికివేసినట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం


మాట్లాడుతున్న కామెర గట్టయ్య

పాతమంచిర్యాల: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు సంఘాలు విఫలమయ్యాయని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల సమస్యలను గత టీబీజీకేఎస్ విస్మరించిందన్నారు. ఎన్నికల్లో గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ లు సర్కార్‌కు తొత్తులుగా మారాయన్నారు. సింగరేణి ఉద్యోగులకు సొంతింటికి 2 గుంటల భూమి ఇవ్వాలని, మారుపేర్ల సమస్య పరిష్కరించాలని, ఓపెన్ కాస్టులు రద్దు, నూతన భూగర్భగనులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో నూతన గనులు ఏర్పాటు కోసం ప్రజా, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో ఉద్యమం చేపడుతామన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, ఉపాధ్యక్షుడు దాసరి జనార్దన్, జిల్లా అధ్యక్షుడు జైపాల్‌సింగ్, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి సమ్ము రాజన్న పాల్గొన్నారు.

నీల్వాయి ఎస్సై సస్పెన్షన్

వేమనపల్లి: ఎట్టకేలకు నీల్వాయి ఎస్సై ఇ.సురేష్‌ను సస్పెండ్ చేస్తూ రామగుండం పోలీస్ కమిషనరేట్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఈ నెల 11న మండలంలోని సుంపుటం గ్రామానికి చెందిన భార్యభర్తల గొడవలో భర్త కిష్టయ్యను స్టేషన్‌కు పిలిపించి చితకబాదాడు. కౌన్సెలింగ్ పేరుతో రూ.10 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధితుడు పోలీస్ కమిషనరేట్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. రక్షణ కల్పించాలని వేడుకున్నాడు. సమగ్ర విచారణ జరిపిన ఉన్నతాధికారులు.. ఎస్సైపై సస్పెన్షన్ వేటు వేశారు.

అ'పూర్వ' సమ్మేళనం


శ్రీ వాసవి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆసిఫాబాద్‌అర్బన్/భైంసారూరల్/కాగజ్‌నగర్ టౌన్: ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు అపూర్వ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించారు. ఆసిఫాబాద్‌లోని శ్రీ వాసవి ఉన్నత పాఠశాలలో 1996–2004 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రోజ్‌గార్డెన్‌లో, కాగజ్‌నగర్‌లోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో బాలభారతి ఉన్నత పాఠశాల 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు, భైంసా మండలంలోని దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2001–02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు చదువుల తల్లి ఒడిలో కలుసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సుబ్బా మహేశ్, ఇందారపు బాలకిషన్, ప్రసాద్, సతీశ్, తిరుమల్‌రావ్, చిత్రాని, చందన, శ్రీనివాస్, బెలే ప్రకాశ్, వామన్‌రావు, విఠల్ పాల్గొన్నారు.


దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు


బాలభారతి ఉన్నత పాఠశాలలో..

హోరాహోరీగా రాష్ట్రస్థాయి పోటీలు

- ఫైనల్ చేరిన హైదరాబాద్


తలపడుతున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర 5వ బేస్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. రెండోరోజు పోటీలను అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్వేత, జిల్లా అధ్యక్షుడు కళాల శ్రీనివాస్, కార్యదర్శి జ్యోతి ప్రారంభించారు. పురుషుల విభాగంలో హైదరాబాద్–రంగారెడ్డి జట్టుపై 5–1 స్కోరుతో గెలిచి ఫైనల్ చేరింది. సోమవారం రెండోసెమీఫైనల్ మ్యాచ్ నిజామాబాద్–మెదక్ జట్లమధ్య నిర్వహించనున్నారు. మహిళల విభాగంలో నిజామాబాద్, రంగారెడ్డి, నల్గొండ, హైదరాబాద్ జట్లు సెమీస్ బెర్త్‌లు ఖాయం చేసుకున్నాయి. ఈ పోటీలు సోమవారం ప్రారంభమవుతాయి.

వేలాలకు పోటెత్తిన భక్తులు

గట్టు మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ



పట్నాలు వేస్తున్న భక్తులు



జైపూర్ మండలంలోని వేలాల గట్టు మల్లన్న స్వామి సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం పురస్కరించుకుని ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చారు. మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టువస్త్రాలతో పట్నాలు వేసి బోనాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. – జైపూర్